# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 19-05-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత్, నార్డిక్ దేశాలు హరిత సాంకేతికత, ఆవిష్కరణల్లో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించుకోనున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ❖ వియత్నాంతో రక్షణ సహకారాన్ని పెంపొందించుకునేందుకు భారత్ కట్టుబడి ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పునరుద్ఘాటించారు.
- ❖ నీట్ యూజీ పరీక్షా ప్రక్రియలో లోపాలను సమగ్రంగా పరిష్కరించాలని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అధికారులను ఆదేశించారు.
- ❖ వ్యాపార సౌలభ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం, పరిశ్రమల మధ్య బలమైన సహకారం ఉండాలని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ అన్నారు.

======================

భారత్, నార్డిక్ దేశాలు హరిత సాంకేతికత, ఆవిష్కరణల్లో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవాలని నిర్ణయించుకున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. నార్వే రాజధాని ఓస్లోలో ఈరోజు జరిగిన మూడవ భారత్-నార్డిక్ శిఖరాగ్ర సమావేశానికి హాజరైన అనంతరం ప్రధానమంత్రి నార్డిక్ దేశాల నాయకులతో కలిసి పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ఈ హరిత సాంకేతిక భాగస్వామ్యంతో, ప్రపంచానికి మెరుగైన భవిష్యత్‌ను అందిస్తామని, దీని కోసం భూ ఉష్ణ, మత్స్య రంగాలలో ఐస్‌లాండ్ నైపుణ్యాన్ని, నీలి ఆర్థిక వ్యవస్థ, ఆర్కిటిక్ రంగాలలో నార్వే నైపుణ్యాన్ని, సముద్రయానం, సుస్థిరత రంగాలలో అన్ని నార్డిక్ దేశాల నైపుణ్యాన్ని భారతదేశ నైపుణ్యాలతో అనుసంధానిస్తామని తెలిపారు. నార్డిక్ దేశాలతో భారత్ సంబంధాలను మరింత పటిష్టం చేసేందుకు 8 సంవత్సరాల క్రితం ఈ ఫార్మాట్‌ను ఏర్పాటు చేశామని, భారతదేశ అభివృద్ధిలో నార్డిక్ దేశాల పెట్టుబడులు ముఖ్య భాగస్వాములుగా మారుతున్నాయని ప్రధానమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

వియత్నాంతో రక్షణ సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవడానికి భారత్ కట్టుబడి ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పునరుద్ఘాటించారు. వియత్నాం అధ్యక్షుడు టో లామ్‌తో సమావేశమైన అనంతరం రాజ్ నాథ్ సింగ్ సోషల్ మీడియాలో ఒక ప్రకటన చేస్తూ... ఇరు దేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఈ సహకారం కీలకమైనదని పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య పరస్పర విశ్వాసం, ఉమ్మడి విలువలు, రక్షణ, భద్రత, ప్రాంతీయ స్థిరత్వంలో సన్నిహిత సహకారంపై ఆధారపడిన బలమైన సంబంధాలు ఉన్నాయని తెలియజేశారు. వియత్నాం రక్షణ మంత్రి జనరల్ ఫాన్ వాన్ గియాంగ్‌తో కూడా రాజ్‌నాథ్ సింగ్ హనోయి నగరంలో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. కాగా.. రాజ్ నాథ్ సింగ్ మూడు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం దక్షిణ కొరియాలోని సియోల్‌కు ఈరోజు చేరుకున్నారు. భారత్-కొరియాల మధ్య రక్షణ సహకారం, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ పర్యటన లక్ష్యమని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

రాబోయే ఐదేళ్లలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బస్తర్ డివిజన్ దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన గిరిజన డివిజన్‌గా ఆవిర్భవిస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. జగదల్‌పూర్‌లో ఆయన ఈరోజు మీడియాతో మాట్లాడుతూ... 2031 నాటికి బస్తర్ ప్రజల సగటు ఆదాయాన్ని 6 రెట్లు పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. రానున్న ఐదేళ్లలో బస్తర్ ప్రాంత అభివృద్ధి కోసం కేంద్ర, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు సంయుక్తంగా ఒక రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేశాయన్నారు. యువత, మహిళా సాధికారత, గిరిజన సంస్కృతి పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించి బస్తర్ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. ఏ సమస్యకూ హింస పరిష్కారం కాదని.. శాంతి, ప్రజాస్వామ్యం ద్వారా మాత్రమే అభివృద్ధి సాధ్యమని అమిత్ షా పేర్కొంటూ...

(వాయిస్ 22 సెకన్లు)

అంతకు ముందు జగదల్‌పూర్‌లో అమిత్ షా అధ్యక్షతన జరిగిన 26వ సెంట్రల్ జోనల్ కౌన్సిల్ సమావేశానికి ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రులతో పాటు కేంద్ర హోం కార్యదర్శి, పలువురు పోలీస్ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

నీట్ యూజీ పరీక్షా ప్రక్రియలో లోపాలను సమగ్రంగా పరిష్కరించాలని కేంద్ర విద్యా శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అధికారులను ఆదేశించారు. నీట్ యూజీ పునఃపరీక్ష సన్నాహకాలను సమీక్షించేందుకు ఆయన ఈరోజు న్యూఢిల్లీలో ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి.. పరీక్షను కఠినమైన భద్రతా నిబంధనల నడుమ, సురక్షితంగా, ఎలాంటి అవరోధాలు లేకుండా, పకడ్బందీగా నిర్వహించాలని ఉద్ఘాటించారు. పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లను పటిష్టంగా పర్యవేక్షించి, సమర్థవంతంగా అమలు చేసేందుకు రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లా మేజిస్ట్రేట్లు, పోలీసు సూపరింటెండెంట్లు సమన్వయ సమావేశాలు నిర్వహించాలని ధర్మేంద్ర ప్రధాన్ ఆదేశాలు జారీ చేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

వ్యాపార సౌలభ్యాన్ని మెరుగుపరిచేందుకు పరిశ్రమలు, ప్రభుత్వం మధ్య బలమైన సహకారం ఉండాలని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన `ఇండియా బిజినెస్ రిఫార్మ్ సమ్మిట్-2026`లో మంత్రి పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత ప్రపంచ పరిస్థితిని, భౌగోళిక రాజకీయ

అనిశ్చితులను భారత్.. వ్యాపార ప్రక్రియలను బలోపేతం చేయడానికి, సంస్కరణలను చేపట్టడానికి ఒక అవకాశంగా చూడాలన్నారు. వ్యాపార సంస్థలు ఆందోళనకు గురికావద్దని, కోవిడ్-19 వంటి అనూహ్య సవాళ్లను భారత్ విజయవంతంగా అధిగమించిందని మంత్రి గుర్తు చేశారు. వ్యర్థాలను తగ్గించడం, ఉత్పాదకతను మెరుగుపరచడం, ఇంధన సామర్థ్యాన్ని పెంచే చర్యలను అవలంబించడం వంటి వ్యాపార పద్ధతులు ఆవశ్యకమని పీయూష్ గోయల్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (EPFO)కు సంబంధించి న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను సకాలంలో పరిష్కరించేందుకు, వ్యాజ్యాలను తగ్గించేందుకు EPFO ప్రయత్నిస్తోందని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ తెలిపారు. న్యూఢిల్లీలో ఆయన ఈరోజు విలేకరులతో మాట్లాడుతూ... నిధి ఆప్కే నికాత్ కార్యక్రమం కింద కేసులను ముందుగానే గుర్తించి.. వేగవంతమైన పరిష్కారం కోసం చర్యలు చేపట్టామని, దీని ఫలితంగా 2024 ఏప్రిల్ 1 నుండి ఈ సంవత్సరం మార్చి 31 నాటికి పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య గణనీయంగా తగ్గిందని చెప్పారు. కార్మిక చట్టాల అమలును, ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ నూతనంగా రూపొందించిన శ్రమ్ సువిధ 2.0, సమాధాన్ 2.0 పోర్టల్స్‌ను ప్రారంభించిందని తెలియజేశారు. సభ్యుల సేవలను క్రమబద్ధీకరించే లక్ష్యంతో EPFO వాట్సాప్ వేదికను ఉపయోగించాలని యోచిస్తున్నట్లు మన్సుఖ్ మాండవీయ తెలియజే శారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరాఖండ్ పూర్వ ముఖ్యమంత్రి, సీనియర్ బీజేపీ నాయకుడు భువన్ చంద్ర ఖండూరి దీర్ఘకాలిక అనారోగ్యంతో ఈరోజు డెహ్రాడూన్‌లో మృతి చెందారు. మాజీ ఆర్మీ మేజర్ జనరల్ అయిన 91 సంవత్సరాల ఖండూరి.. 2 సార్లు ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి గాను, అలాగే అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వంలో కేంద్రమంత్రిగాను బాధ్యతలు నిర్వహించారు. ఖండూరి మరణం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహా పలువురు ప్రముఖులు సంతాపం తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

వీధి శునకాల కారుణ్య మరణానికి సుప్రీంకోర్టు తొలిసారిగా అనుమతించింది. నయంకాని వ్యాధులతో బాధపడుతున్నవి, లేదా ప్రమాదకరమైన వీధి శునకాల బెడదను పరిష్కరించే దిశగా జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్. వి. అంజరియాలతో కూడిన ధర్మాసనం పలు ఆదేశాలు జారీ చేసింది. వీధి కుక్కల సంఖ్య ఆందోళనకర స్థాయికి చేరిన ప్రాంతాలలోనూ, అవి కరవడం వల్ల ప్రజా భద్రతకు ముప్పు వాటిల్లుతున్న సందర్భాల్లో పురపాలక సంస్థలు శునకాల కారుణ్య మరణాన్ని కోరవచ్చని ధర్మాసనం పేర్కొంది. పిల్లల్లో వీధి కుక్కల కాట్లు, రేబిస్ కేసుల ఘటనలను వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో.. గత ఏడాది జూలై 28న సుమోటోగా స్వీకరించిన కేసులో ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇదిలా ఉండగా.. వీధి కుక్కలను వేరే చోటికి తరలించడం, వాటికి సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేయడంపై గతంలో ఇచ్చిన ఉత్తర్వును ఉపసంహరించుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు ఈరోజు కొట్టివేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఐపీఎల్-2026లో భాగంగా జైపూర్ వేదికగా రాజస్థాన్ రాయల్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన రాజస్థాన్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్ ప్రారంభించిన లక్నో సూపర్ జెయింట్స్ 10 ఓవర్లు పూర్తయ్యే సరికి ఒక వికెట్ నష్టపోయి 127 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ వ్యాప్తంగా ముడి చమురు ధరలు ఒక్కసారిగా పెరగడంతో దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు ఈరోజు లీటరుకు సుమారు 90 పైసల చొప్పున పెరిగాయి. పెరిగిన ధరల ప్రకారం ఢిల్లీలో ఒక లీటర్ పెట్రోల్ ధర 98 రూపాయల 64 పైసలకు, డీజిల్ ధర 91 రూపాయల 58 పైసలకు చేరింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =